అమలు కానీ ఎమ్మెల్యే హామీ

-చదువుకు దూరమవుతున్న బడుగు విద్యార్థులు

ప్రజాశక్తి-ఆదోని

డివిజన్ కేంద్రమైన ఆదోనిలో విద్యార్థినిలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. హాస్టల్‌కు వస్తే సౌకర్యాలు లేకపోవడం వల్ల గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక మధ్యలోనే మానేసి బాల కార్మికులుగా మిగిలిపోతున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రతి విద్యార్థినికి హాస్టల్ వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే పార్థసారథి గత నెల 22న నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. ఉన్నఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆధునీకరించడం, అద్దెభవనం తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి బాలికకు హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆయన మాటలు నమ్మి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్లో ఉన్నత విద్యాభ్యాసన కోసం చేర్పించారు. తరగతులు ప్రారంభమై 20 రోజులు గడిచినా హాస్టల్ వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమీ లేక చదువులు మధ్యలోనే ఆపేసే పరిస్థితి ఉందని బిసి విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల రోజువారీగా ఆటో చార్జీలు చెల్లించుకోలేక స్కూళ్లకు డుమ్మా కొడుతున్న పరిస్థితి ఉంది.

నెరవేరని ఎమ్మెల్యే హామీ: డివిజన్ కేంద్రమైన ఆదోనిలో అద్దె భవనంలోనైనా బిసి హాస్టల్ కొనసాగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పార్థసారథి గత నెల 22న పత్రికాముఖంగా హామీ ఇచ్చారు. అర్హులైన విద్యార్థినిల నుండి హాస్టల్ వసతి కోసం దరఖాస్తులు స్వీకరించాలని సోషల్ వెల్ఫేర్ అధికారులకు ఆదేశించారు. ఆ సూచన మేరకు ఆదోని పట్టణంలోనే ప్రభుత్వ బాలికల హై స్కూల్ ప్రాంగణంలో ఉన్న ఎస్‌సి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అధికారులకు తల్లిదండ్రులు దరఖాస్తుల సమర్పించారు. ఇప్పటివరకు సుమారుగా 160 మంది విద్యార్థినిలు దరఖాస్తులు చేసుకున్నారు. తరగతులు గత నెల 13న ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు హాస్టల్ సదుపాయం లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుండి రోజు చదువుకోడానికి ఆదోనికి వచ్చేందుకు వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రత్యామ్నాయంగా హాస్టల్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ రోజు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ చుట్టూ తిరుగుతున్నా అక్కడ ఉద్యోగుల నుండి సరైన సమాధానం రాకపోవడంతో నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆరో తరగతి నుండి పదవ తరగతి చదివే బిసి విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ దిశగా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


హాస్టల్ విద్యార్థినిలు ఫైల్‌ఫొటో

విద్యార్థులందరికీ వసతి కల్పించాలి

శ్రీనివాసులు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు



ఆదోని డివిజన్ కేంద్రమైన ఆదోనిలో చదువుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి చదువే గ్రామీణ విద్యార్థులకు తప్పనిసరిగా హాస్టల్ వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బిసి హాస్టల్ నిర్వాహణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఎంతో హర్షించారన్నారు. ఎమ్మెల్యే హామీ ఇచ్చి రోజులు గడిచినా ఎలాంటి చర్యలు కనపడలేదు. దరఖాస్తు చేసుకున్న వారందరూ హాస్టల్ సీటు కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి. దరఖాస్తు చేసుకున్న బిసి బాలిక విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించాలని లేనియెడల ఆందోళన చేపడతామన్నారు.

అందమైన నగరమే లక్ష్యం

-సమన్వయంతో పార్కులను మారుస్తాం
-ప్రజాశక్తితో హార్టికల్చర్ ఎడి కె.విజయలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలును ప్రజలందరి సహకారంతో అందమైన నగరంగా తీర్చి దిద్దడం మా ప్రధాన లక్ష్యం. ఇందులో ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాలు సమన్వయంతో పార్కులు, డివైడర్లలో రకరకాల పూల మొక్కలు, అందమైన చెట్లను పెంచి ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పంచే విధంగా తీర్చిదిద్దుతాం. మరోపక్క రాజకీయ నాయకులు వారి అనుయాయులు పార్కులను, రోడ్లను కబ్జాలు చేస్తూ ప్రజల ఆరోగ్యాలకు భంగం చేస్తున్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తూ, ట్రాఫిక్ అంతరాయం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షించడంలో ప్రజలు, రాజకీయనాయకులు సహకరించినప్పుడు సులభమవుతుంది. తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి పెంచి పెద్ద చేస్తే అవి మనకు ఆక్సిజన్, పండ్లు నీడనిస్తాయి.' అని హార్టికల్చర్ ఎడి కె.విజయలక్ష్మి అన్నారు. ఆమె ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

కర్నూలు నగరంలో ఎన్ని పార్కు స్థలాలు ఉన్నాయి? ఎన్నిటికి కాంపౌండ్ గోడలు ఉన్నాయి? ఎన్ని అభివృద్ధి చేశారు?

ఎడి: కర్నూలు నగరంలో 152 పార్కు స్థలాలు ఉన్నాయి. అందులో 114 స్థలాలకు కాంపౌండ్ గోడలు ఉన్నాయి. వాటిలో 80 పార్కులను అభివృద్ధి చేశాం.

పార్కుల నిర్వహణకు ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు?

ఎడి: కాంట్రాక్టు కార్మికులు 73 మంది పనిచేస్తున్నారు. అందులో అమీన్ కాంట్రాక్టర్ కింద 17 మందికి ఒక్కొక్కరికి రోజుకు రూ.560 కూలీ ఇస్తున్నాం.

వేసవిలో ఎక్కువగా డివైడర్ల మధ్య వున్న చెట్లు చనిపోవటానికి కారణమేంటి?

ఎడి: వేసవిలో వేడితో పాటు పిండిపురుగు ఆశించడంతో వేపచెట్లతో సహా చిన్న మొక్కలు కూడా చనిపోయాయి. వాటి స్థానంలో మళ్ళీ కొత్త మొక్కలను నాటుతున్నాం.

వర్షాకాలం ఆరంభంలో మొక్కలు ఏమైనా నగర ప్రజలకు పంపిణీ చేస్తున్నారా?

ఎడి: వర్షాకాలంలో ఇండ్ల వద్ద పండ్ల మొక్కలు సీతాఫలం, జామ, నేరేడు, రేగు, సపోటా లాంటి మొక్కలు ఇంటికి ఒకటి చొప్పున, డిపార్టుమెంట్లకు ఆరు మొక్కలను ఇచ్చేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నాం.


హార్టికల్చర్ ఎడి కె.విజయలక్ష్మి

మొక్కల పెంపకం పర్యవేక్షణకు సహాయకులను ఏమైనా తీసుకున్నారా?

ఎడి: నగరంలో మొక్కల పెంపకం పర్యవేక్షణకు అగ్రికల్చర్ డిప్లమా ఉన్నవారిని ఐదుగురిని తీసుకున్నాం. వారు పనిచేస్తున్నారు. నగరంలో పచ్చదనం పరిశుభ్రత అభివృద్ధి చేయాలన్నా నగర ప్రజలు సహకరించాలి. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించిన నాడే కర్నూలు నగరం పచ్చదనంతో పాటు మనుషులకు కావాల్సిన పండ్లు, ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ కూడా ఇస్తాయి.

మొక్కలు సంరక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎడి: కర్నూలు నగరంలో పార్కులలో , డివైడర్ల మధ్య నాటిన మొక్కలను, చెట్లను సంరక్షించేందుకు ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయం చేసుకొని నగరంలోని మురుగు నీటి శుద్ధి చేసి ఆ నీటిని ట్యాంకర్ల ద్వారా మొక్కలు సంరక్షణకు వాడుతున్నాం. కార్యక్రమం డంప్‌యాడ్ వద్ద తడి చెత్త నుండి తయారు చేసిన ఎరువును మొక్కలకు వాడుతున్నాం.

నగరంలో మొక్కలు పెంపకం కోసం సలహాలు సూచనల కోసం ఎవరిని సంప్రదించాలి?

ఎడి: నగరంలో మొక్కలు పెంపకం కోసం సలహాలు సూచన కోసం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఎడి కె. విజయలక్ష్మి 7849908499 నెంబర్ కు సంప్రదించాలి.



కార్మికుల ఉద్యోగ భద్రతకు ఉద్యమం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పాఠశాలలో పనిచేస్తుంటే నేషన్ వర్కర్లతో పాఠశాలలో పనిచేస్తున్న నైట్ వాచ్మెన్‌లకు రాజకీయ ఒత్తిళ్లు వేధింపులు తొలగింపులు జరుగుతున్నాయని, తక్షణమే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, లేదంటే నూతన ప్రభుత్వాలపై ఉద్యమ బాటకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆయాలు, నైటు వాచ్మెన్లు ముఖ్య కార్యకర్తల సమావేశం సువార్తమ్మ, రాజుల అధ్యక్షతన కార్మిక కర్షక భవన్లో ఆదివారం నిర్వహించారు. అంజిబాబు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల పోరాటాల వల్లే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తన బలం తగ్గిందని రాష్ట్రంలో గత ప్రభుత్వాన్ని ప్రజలు కార్మికులు ఓడించారని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టబోతుందని ఆ బడ్జెట్లో కార్మికులకు తన వాటాను కచ్చితంగా కార్మికులకు కేటాయించాలని లేబర్ కోడులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న దేశవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసన తెలియజేయాలని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జె. నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు విజయ భారతి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలన్న లక్ష్యంతో శిక్షణ ఇచ్చారని ఆ శిక్షణలో కార్మికుల గురించి వారి సమస్యల గురించి చర్చించలేదన్నారు. పౌష్టికాహారాన్ని అందించాలంటే సోనా మైసూర్ బియ్యాన్ని సరఫరా చేయాలని, మిక్సీలు, గ్రైండర్స్ ప్రభుత్వం ఇచ్చిన వంట పాత్రలు రద్దు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. సమావేశంలో మూడు సంఘాల నాయకులు లలితమ్మ ,రజియా, సుజాత ,రాజమణి, అమ్మన్ని ,లీలావతి, వెంకటేశ్వరమ్మ ,జహారాభి, లచ్చుమ్మ ,బద్రునిషా, డబ్ల్యూ .లలితమ్మ, నాగమణి ,లచ్చుమ్మ , శివమ్మ ,ఆయాల యూనియన్ నుండి జయలక్ష్మి, బజారమ్మ, శారద, జుబేదా ,లక్ష్మి, సువర్ణ, సుగుణ, పఠాన్ ఆసియా , నాగరాజు, బాబు, పౌలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 8న సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కార్పొరేషన్ క్యాలయంలో...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 11:00 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎ.భార్గవ్‌తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఏవైనా సమస్యలుంటే, అర్జీ, ఆధార్, మొబైల్ నెంబర్లతో వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, తద్వారా సమస్యకు సత్వరమే పరిష్కారం పొందవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

మురుగు కాలువల్లో తాగునీటి పైపులైన్ల తొలగింపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలో మురుగు కాలువల వద్ద తాగునీటి పైప్‌లైన్ల క్రాసింగ్‌లను తొలగించి, సురక్షితమైన ప్రదేశాలకు మార్చేందుకు నగర పాలక సంస్థ చర్యలు తీసుకుంటుంది. ఇంజినీరింగ్ విభాగపు అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడారు. నగర వ్యాప్తంగా మురుగు కాలువల వద్ద తాగునీటి క్రాసింగ్ పైప్‌లైన్లను తక్షణమే తొలగించాలని, తద్వారా నీరు కలుషితం అయ్యేందుకు అవకాశం ఉందన్నారు. అదే విధంగా పైప్‌లైన్ లీకేజీలను గుర్తించాలని ఆదేశించారు. దీంతో నగరపాలక సంబంధింత అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఆదివారం డిఇలు గోపాలకృష్ణ, నరేష్, గిరిరాజు, కృష్ణలత, రాజశేఖర్ ఎఇలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, భాను ప్రకాష్, జనార్ధన్, ట్రైనీ ఎఇలు, స్థానిక ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, అమెనిటిస్ సెక్రెటరీలు పలు క్రాసింగ్ పాయింట్లను పరిశీలించారు. వాటిని తొలగించి ప్రత్యామ్నాయ ప్రదేశాల్లోకి మార్చేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.


డివైఎఫ్ఐ కర్నూలు నగర నూతన కమిటీతో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్

డివైఎఫ్ఐ న్యూ సిటీ నూతన కమిటీ ఎంపిక

డివైఎఫ్ఐ న్యూ సిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గౌతమ్, హుస్సేన్‌బాష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డివైఎఫ్ఐ కర్నూలు న్యూ సిటీ నూతన కమిటీ ఆదివారం ఎన్నుకున్నారు. కర్నూలు డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో 1980వ సంవత్సరం పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో అందరికీ విద్య అందరికీ ఉపాధి కావాలంటూ డడివైఎఫ్ఐ సంఘాన్ని స్థాపించారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు, మహనీయుల జయంతి వర్ధంతులను నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా డివైఎఫ్ఐ ఎదిగిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువతను చెడు మార్గం పట్టించే విధంగా ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా గంజాయి మత్తు ఇతర డ్రగ్స్ కు, అశ్లీలతకు, మొబైల్ గేమ్ లకు బానిసలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడ లేనంత యువత భారతదేశంలో ఉన్నదని, సరైన ఉపాధి అవకాశాలు లేక యువత శక్తి సామర్థ్యాలు వృధా అవుతున్నాయన్నారు. గ్రామ గ్రామం వీధి వీధిన డివైఎఫ్ఐ సంఘాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగం అంతం, డ్రగ్స్ అంతం అవినీతి అంతం డివైఎఫ్ఐ పంతం అనే నినాదంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న కర్నూలు జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డివైఎఫ్ఐ కర్నూలు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా పి. గౌతమ్, హుస్సేన్ బాష , ఉపాధ్యక్షులుగా విజయ్, సాయిఉదయ్, మహేష్, విక్రమ్ సహాయ కార్యదర్శి ఇమ్రాన్, వీరేష్, శివశంకర్, సికిందర్, నవీన్ వీరితోపాటు మరో పదిమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.


హుస్సేన్‌బాషా - గౌతమ్

దేవాలయ నిర్మాణానికి రూ.44 వేలు విరాళం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా కురువసంఘం అద్వర్యంలో పెద్దపాడు సమీపంలోని ఆదర్శ పాఠశాల పక్కన నిర్మాణంలో ఉన్న శ్రీభీరలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణా నికి గూడూరు మండలం కే.నాగలాపురానికి చెందిన సుంకన్న రూ. 44 వేలు విరాళం ఇచ్చారు. ఆదివారం ఆయన ఈ నగదును జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వ ర్లుకు అందజేశారు. ఎం.కే.రంగస్వామి మాట్లాడుతూ దాతల సహకారంతో గోపురంనిర్మాణం, అమీలియా హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రసాద్ సహకారంతో ప్రహరీగోడ నిర్మాణం పూర్తి అయ్యిందని, మిగతా నిర్మాణ పనులు చాల ఉన్నాయని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో భరత్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఆదివారం లక్ష్మీనగర్‌లోని వికాస్‌స్కూల్‌లో సిరి, శ్రీదత్త మహిళా ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి అనూహ్యస్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ బి.స్వాతి కంటి పరీక్షలు నిర్వహించి మందులను సూచించారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ కింద చేస్తామన్నారు. ఆపరేషన్లు చేయించుకునేవారు భరత్ ఆసుపత్రికి, ఆరోగ్యశ్రీ కార్డు ఆధార్ కార్డులు తీసుకొని వస్తే ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారన్నారు. ఆప్తామాలజిస్ట్ వి. రవి, టెక్నీషియన్లు బి.తరుణ్, కిరణ్ కుమార్‌లు ఈ వైద్య శిబిరంలో సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమానికి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో యిలాంటి కార్యక్రమాలు చేస్తూ ఉంటామన్నారు. ప్రతి రెండు నెలలకోసారి చివరి ఆదివారం ఆగస్టు 25న సుందరయ్య భవన్‌లో బిపి ,షుగర్, మూర్ఛ వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులు కేవలం రూ.200 ఇస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరం లోదాదాపు 200 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తికేంద్రం నాయకులు జెఎన్. శేషయ్య, రంగస్వామి, ఎలాగౌడ్, శేషాద్రి, లక్ష్మీ నగర్ వార్డ్ అభివృద్ధి కమిటీ నాయకుల వెంకటేశ్వర్లు, సిరి మహిళ ఐక్య సంఘం అధ్యక్షురాలు వి.రాధిక, కోశాధికారి కె.సరిత, కార్యదర్శి బి. హైమావతి, ఐద్వా నాయకురాలు ఎ.లీలావతి, శ్రీ దత్త మహిళా ఐక్య సంఘం కార్యదర్శి కె.ఊర్మిళ, కోశాధికారి చిట్టి, ఆర్‌పిలు మంజుల ,పద్మ, కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ నాయకులు జి .పద్మజ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బి.స్వాతి


ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రసాద్‌శర్మ

నేటి నుండి అందుబాటులోకి ఉచిత ఇసుక

టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రంలో ఉచిత ఇసుక ఫాలసీని ఈ నెల 8న అమలులోకి తీసుకొని రానున్నారనీ టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం తన పార్టీ అనుచరులతో రాష్ట్రంలోని వాగులు, వంకలు, నదులు అనే తేడా లేకుండా మొత్తం ఇసుకను తవ్వేసి లక్షలాది కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారన్నారు. వైసిపి ఇసుక మాఫియాతో రాష్ట్రంలోని నదులు ఎడారులుగా మారిపోయే పరిస్థితికి తీసుకొని వచ్చారని అన్నారు. లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికులు రోడ్డునపడ్డారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు భాధ్యతలు చేపట్టిన వెంటనే గత ప్రభుత్వం జారీ చేసిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేశారన్నారు. జులై 1న తాను చేసిన వాగ్దానం మేరకు రూ.4 వేలు సామాజక పెన్షన్ తోపాటు ఏప్రిల్ నుండి జూన్ మాసాలకు వెయ్యి రూ.లు కలిపి రూ. 7 వేలు అందజేశారన్నారు. రేపటి నుండి ఇసుకను ఫ్రీగా ప్రజలకు అందజేసేందుకు ఆదేశాలు వెలువడ్డాయని వివరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు నాయుడు ఎంతో శ్రమిస్తారన్నారు. పార్టీ నాయకులు వై.నాగేశ్వరరావుయాదవ్, కె.నాగేంద్ర, కెవి.సుబ్బారెడ్డి, పి.రవికుమార్, కె.పరమేష్, దాశెట్టిశ్రీను, ఎస్.ముంతాజ్, పి.హనుమంతరావు చౌదరి, ఎస్‌వి. ప్రసాద్, గట్టు తిలక్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి


పేదలకు దుప్పట్లు దోమతెరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పేదలకు దుప్పట్లు దోమతెరలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్లోనీ గురుదత్త పాలిక్లినిక్‌లో ఆయన పేదలకు సీజన్ వ్యాధుల నుండి రక్షించుకునేందుకు వీలుగా దుప్పట్లు ,దోమతెరలను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సీజన్‌లో నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, కలుషిత నీరు తాగడం వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కలిషిత నీరు తాగడం వల్ల కలరా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ సీజన్‌లో దోమలు అధికంగా ఉంటాయని దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరు దుప్పట్లు, దోమతెరలను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, మెదడు వాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో విష జ్వరాలు అధికమయ్యాయని, మన రాష్ట్రం పక్కనే ఉండడం వల్ల మన రాష్ట్రంలో కూడా అవి ప్రబలే అవకాశం ఉందని సూచించారు.ఇప్పటికే మన రాష్ట్రంలోని కోస్తా ప్రాంతంలో అతిసార వ్యాధి ప్రబలిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వారానికి ఒకసారి గుడ్లు పౌష్టిక ఆహారం తీసుకోవలసిన అవసరం ఉందని చెప్పారు.

టిడిపి కార్యకర్తను పరామర్శించిన నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో అనంతపురం నుండి వచ్చి చికిత్స పొందుతున్న ఐటిడిపి అనంతపురం ప్రధాన కార్యదర్శి మంజునాథ్‌తల్లిని ఆదివారం సాయంత్రం టిడిపి నగర ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్ ఐటిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు గట్టు తిలక్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు యాదవ్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు అఖిల్ సభ్యులతో కలిసి పరా మర్శించారు. మంజునాథ్ తల్లికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. టిడిపి నాయకులకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరో సానిచ్చి వారి కుటుంబానికి నాగరాజు యాదవ్ ఆర్థిక సాయం చేశారు. టిడిపి నాయకులు, ఐటిడిపి సభ్యులు ఆనంద్ , మురళి దినేష్, ఎరుకలి సాయి పాల్గొన్నారు.



తుంగభద్రకుకు 47 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

20 టిఎంలకు చేరిన నీటి నిల్వ

ప్రజాశక్తి - హోళగుంద

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, దవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు రోజుకు 47000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు తుంగభద్ర డ్యామ్ బోర్డ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్ లో 20 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఈ రెండు మూడ రోజుల్లో రుతుపవనాల కారణంగా ఈ వారంలో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. గత ఏడాది జూన్ జులై నెలలో ఎలాంటి ఇన్‌ఫ్లో ఉండేది కాదు. ఈ ఏడాది జులై మొదలు కావడంతో త్వరలో డ్యాం లోకి నీరు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. తుంగభద్ర డ్యాం , ఎల్ఎల్‌సి కాల్వ పై ఆధారపడిన రైతులు తమ పొలాల్లో దుక్కులు దున్నడం మొదలుపెట్టారు. గత ఏడాది వర్షాలు లేక బెంగళూరు బొంబాయి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు సైతం గ్రామాలకు వచ్చి చేరుకొని తమ తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు.

ఆయకట్టు రైతుల చిగురిస్తున్న ఆశలు

తుంగభద్ర డ్యామ్‌కు వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఎల్ఎల్ సి కాల్వ కింద సాగు చేస్తున్న ఆయకట్ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాది మంచి వర్షాలు లేక తుంగభద్ర డ్యామ్‌కు వరద అంతంత మాత్రమే ఉండటంతో ఒకే పంటతో సరిపెట్టుకున్నామని ఈ ఏడాది రెండు పంటలు పండించుకునే అవకాశం కనబడుతుందని రైతులు చర్చించుకోవడం విశేషం. ఎల్ఎల్‌సి కాల్వ కింద సాగు చేసే రైతులు ఎక్కువ శాతం వరి పంటపై ఆసక్తి కనబరుస్తారు. గత ఏడాది నుండి వరి క్వింటాళుకు రూ.2500 నుండి రూ.3000 వరకు ధర పలకడంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కేవలం 1400 నుండి 1500 మాత్రమే ధరలు పలకగా పెట్టిన పెట్టుబడి సైతం రాక పూర్తిగా నష్టపోయామని ప్రస్తుతం ధరలు రెండింతలు పెరగడంతో వరి పంట లాభదాయకమని చెప్పవచ్చని రైతులు తెలిపారు.

జలచౌర్యానికి అడ్డుకట్టపడేనా?

ఎల్ఎల్‌సిజలచౌర్యానికి ఈ ఏడాదైనా అడ్డుకట్టపడేనా? అని ఆయకట్టు రైతులు చర్చించుకుంటున్నారు. గత రెండేళ్లుగా జలచౌర్యానికి చెక్ పెట్టడానికి ఆధునీకరణ పనులు చేపట్టారు. ఆధునీకరణ పనుల వల్ల నీరు వృధా కాకుండా ఆఖరి ఆయకట్టు రైతుల వరకు సాగునీరు అందించాలనే సదుద్దేశంతో కోట్ల రూపాయలు ఖర్చు ఇచ్చి నిర్మాణ పనులు చేపట్టారు. అయినా పూర్తిగా ప్రయోజనం లేకుండా పోయిందని కొంతవరకు నీరు స్పీడుగా పరుగులు తీసిన జలచౌర్యాన్ని మాత్రం ఆపలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. ఈసారైనా ముందు జాగ్రత్తగా ఎల్ఎల్‌సి కాలువలపై బోర్డు అధికారులు గస్తీ తిరిగి కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్‌లో వేసిన పైపులను తొలగించి ఆయకట్టు రైతులకు సమృద్ధిగా నీరు అందిస్తారా లేక యధారాజ తథా ప్రజా అన్నట్టుగా వ్యవహరిస్తారా !అన్నది రైతుల ముందున్న ప్రశ్న.

రబీ పరిహారం అందేనా..?

-ఖరీఫ్ పరిహారంలోనూ అరకొర
-రబి పంట నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు
- పెట్టుబడులు కోసమైన వస్తే బాగుంటుందన్న రైతులు
-అధికారులను అడిగిన ఏ సమాధానం చెప్ప లేకపోతున్న వైనం

ప్రజాశక్తి-చిప్పగిరి

వేల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన సాగుచేసిన పంటలు చేతికి రాక అతివృష్టి అనావృష్టి ఏర్పడి ప్రతి సంవత్సరం ఏదో ఒక రకంగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. రైతులను ప్రభుత్వాలు గట్టెక్కించడానికి కరువు పరిహారం పేరుతో ఏ కొద్దిమందికో పరిహారం అందజేసి, పరిహారం ఇచ్చామని గొప్పలు చెప్పకుంటున్నారు. వాస్తవానికి ఏ గ్రామాలలో కూడా నష్టపోయిన రైతులందరికీ కూడా పంట కరువు పరిహారం అందడం లేదని రైతులు తమ మనోవేదనను వెలుబుచ్చుతున్నారు. ఖరీఫ్ పంటలకు గాను ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా ప్రతి సచివాలయాలలోనూ రైతుల పేరుతో ఉన్న లిస్టును అతికించారు. రైతులు ఆ లిస్టు చూసి సంబరపడిపోయారు. కానీ ఆ లిస్టులో ఇప్పటివరకు కూడా సగం మందికి కూడా పరిహారం అందలేదని రైతులంటున్నారు. చిప్పగిరి మండలంలో ఖరీఫ్ పంటల కన్నా రబీ పంటల సాగు చేసే నల్ల రేగడి భూములు ఎక్కువ. మండలంలో అధికారుల వివరాల మేరకు రబి పంటలు వేసి నష్టపోయిన వారు దాదాపు 4069 రైతులు ఉన్నారని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. గత ప్రభుత్వంలో రబి పంటలు వేసి నష్టపోయిన రైతుల సమాచారం అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాల దగ్గర ప్రదర్శించి రైతులకు వివరాలు అందించారు. రబీలో పంటలు వేసి నష్టపోయిన 4069 రైతులకు గత ప్రభుత్వం రూ.6 కోట్ల 35 లక్షల 50 వేల 698 అలాట్మెంట్ ఇచ్చిందని అధికారులు తెలుపుతున్నారు. ఈ పరిహారం కోసం రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ అధికారులను రబీ పరిహారం ఎప్పుడొస్తుందోనని, మాకు ఆ పరిహారం అందితే

పరిహారం అందితే పెట్టుబడులకు ఉపయోగపడతాయి



గురు స్వామి, రైతు నేమకల్లు

పంటలు వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రబి పరిహారం రైతుల ఖాతాలకు జమ చేస్తే మాకు ఇప్పుడు పెట్టే పెట్టుబడులకు ఎంతో సహాయం చేకూరుతుంది. నాకు రబి పరిహారం కింద రూ, 10600 ను లిస్టులో చూపెట్టారు. అందువల్ల వెంటనే కొత్త ప్రభుత్వం రైతులపై దయవుంచి మంజూరు చేయాలి.



వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పప్పుశనగ పంట (ఫైల్‌ఫోటో)

ఇప్పుడు వేసే పంటలకు కొద్ది వరకు అయినా పెట్టుబడులు పెట్టుకోవడానికి అవసర పడతాయని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు మాత్రం వారి దగ్గర సమాధానం లేక రైతులకు ఏమి చెప్పలేకపోతున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం రబీ పరిహారం నిధులను రైతులు ఖాతాలకు వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



ఎపి రైతు సంఘం నాయకులు కెపి. నారాయణస్వామి

ఖరీఫ్‌లో పెండింగ్లో ఉన్న రైతుల పరిహారం , రబి పంటలు వేసి నష్టపోయిన రైతులకు పరిహారం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆలస్యమైన ఎడల నిరసనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఉత్తమ సేవలందించడమే బ్యాంకు లక్ష్యం

ప్రజాశక్తి-ఆదోని



మాట్లాడుతున్న బ్యాంకు ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

ఖాతాదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యమని ప్రియదర్శిని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదోనిలోని బ్యాంకు శాఖలో 27వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలధనం రూ.1.77 కోట్లు, డిపాజిట్లు రూ.53.59 కోట్లు, ఇచ్చిన రుణాలు రూ.30.20 కోట్లు, నిరర్థక ఆస్తులు 3.60 శాతం, నికర లాభం రూ.96.40 లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఏడాదికి డివిడెంట్ 9 శాతం వాటా మూలధనం చెల్లించాలని సభ ఆమోదించిందన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ ఎం. లక్ష్మణరావు, డైరెక్టర్ జిపి.దర్శన్‌లాల్, కె.దీపక్, హెచ్.దశరరథ రామిరెడ్డి, బ్యాంక్ సిఇఒ కె.రమేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఆదోని



ఆదోనిలోని ఫరిస్నా మొహల్లా దర్గా పక్కన గౌసియా మదర్సాలో సోమవారం ఎంహెచ్ఎ హెచ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ అధ్యక్షుడు అల్‌హజ్ షేక్ మొహమ్మద్, హుసేన్ అహ్మద్ కోరారు. ఆదివారం ఆదోనిలోని కమిటీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు అల్‌హజ్ షేక్ మొహమ్మద్, ఫరూక్ సిబ్లీ ఆదేశాల మేరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ ఆబిద్ హుస్సేన్, లీగల్ సెల్ షేక్ మొహమ్మద్ జాన్ బాష, జనరల్ సెక్రెటరీ బషీరాబాద్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో పాలుపంచుకుందాం

ప్రజాశక్తి-ఆదోని : సామాజిక సేవలో పాలుపంచుకొని ముందుకు సాగుదామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ రెడ్డి, సైఫుల్లా తెలిపారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా సందీప్ రెడ్డి డాక్టర్ సైఫుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు రోటరీ క్లబ్ సమావేశం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంకె.రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ గవర్నర్ దశరథ రామిరెడ్డి, ముఖ్య అతిథిగా గవర్నమెంట్ ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలో శాంతి నెలకొనాలని నిమిషం పాటు మౌనం పాటించారు. రోటరీ క్లబ్ ఆదోని నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సందీప్‌రెడ్డి, డాక్టర్ సైఫుల్లా, ట్రెజరర్‌గా వికాస్ బండారితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు, ఉచితంగా కంటి ఆపరేషన్లు, దివ్యాంగులకు సైకిల్ ట్రైలు, విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలల్లో వసతులు, చెట్లు నాటడం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రతి ఏడాది జరిగే సేవా కార్యక్రమాలను ఈ ఏడాది కూడా దిగ్విజయంగా నిర్వహిస్తామని అన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు భరత్ షా , విట్టా మురళీ, జీవన్ సింగ్, ప్రశాంత్ గాంధీ, సునీల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాచోటీ సుబ్బయ్య, ఉమేష్ పాయి, వినోద్ జైన్, పద్మనబయ్య శెట్టి, శేషయ్య సోమశేఖర్ రెడ్డి, అమిత్ గాంధీ, ఇతేష్, విట్ట రాజేష్, హుస్సేన్ పాల్గొన్నారు.



రోటరీక్లబ్ నూతన కార్యవర్గం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -గోనెగండ్ల

పూర్వవిద్యార్థులంతా ఒకే చోట కలిసి చదువుకొని కలిసి పెరిగారు. 30 సంవత్సరాల తర్వాత ఒకే చోట చేరి ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఆనందంతో పులకించిపోయారు. ఈ వేడుకకు వేడుకగా నిలిచింది. గోనెగండ్లలోని భాషా ఫంక్షన్ హాల్. మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకొని వారి కుటుంబాల పరిస్థితులు ఆర్థిక, ఆరోగ్య విషయాల గురించి చర్చించుకొని పూర్వ జ్ఞాపకాలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ స్నేహ సంబంధాలను ఇలాగే కొనసాగించాలనకున్నారు. గోనెగండ్ల ఫోటో 30 సంవత్సరాల కలుసుకున్న పూర్వ విద్యార్థుల వివరాలను మురళీ రెడ్డి వివరించారు.

తమిళనాడు బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్మ్ స్ట్రాంగ్ హత్యను నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు



బహుజన్ సమాజ్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు ఆర్మ్ స్ట్రాంగ్ దారుణ హత్యను నిర్వహిస్తూ ఎమ్మిగనూరు అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుమంచాల లక్ష్మీ నారాయణ ఆర్మ్‌స్టాంగ్ దారుణ హత్యను ఖండిస్తూ వారి ఫోటోకు పూలమాలవేసి నివాళు లర్పించారు. తమిళనాడు రాష్ట్ర రాజధాని బహుజన సమాజ్ పార్టీ జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని అతి కిరాతకంగా నరికి చంపడం ఆ రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ కేసులో అసలైన ప్రధాన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వెంటనే ఈ హత్య కేసును సిబిఐకి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బిఎస్‌పి కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు గుడిపి సామెల్,ఎమ్మినూరు అసెంబ్లీ అధ్యక్షులు నాగరాజు, మాట్లాడుతూ తమిళ రాష్ట్ర అధ్యక్షులు ఆర్మ్‌స్ట్రాంగ్ అడ్వకేట్‌గా రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తూ బహుజనుల డైనమిక్ లీడర్ ఆర్మ్‌స్ట్రాంగ్ దారుణ హత్యను ఖండిస్తూ నిందితులను వెంటనే శిక్షించాలని దేశంలో బహుజనులు పాలకులు అయితేనే రక్షణ అని మాట్లాడారు. ఎమ్మిగనూరు అసెంబ్లీ సెక్రెటరీ నాగన్న బివిఎఫ్ కన్వీనర్ చంద్ర శేఖర్, మాలపల్లి సుధ ,ప్రశాంత్ కార్యకర్తలు ఉలిగప్ప, ఎల్లప్ప, నరసన్న, ఈరన్న, ఏసన్న, రత్నం,ఎ రాజేష్ బాబు చిన్న ఈరన్న చిన్నన్న ఏసేపు పాల్గొన్నారు.




శ్రీ మఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

ప్రజాశక్తి- మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారికి స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. పల్లకి సేవ చేయించిన భక్తులచే పల్లకిని మోయించారు. సేవా దారులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

ముస్లింలపై గో మూక దాడులను ఖండించండి : ఆవాజ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ముస్లింలపై గోమూక దాడులను ఖండించాలని, ప్రజాతంత్ర వాదులను, లౌకిక వాదులను, వామపక్షాలను అవాజ్ కమిటీగా కోరారు. ఆదివారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఆవాజ్ నగర్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి.షరీఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన, జూన్ 4 నుండి ,దేశంలో పలుచోట్ల విద్వేష దాడులు, హింసాత్మక సంఘటనలు పెరిగిపోయాయన్నారు. ఈగోగుండాల దాడులపై, ప్రముఖ ముస్లిం సంస్థలైన జమాతే ఇస్లామి హింద్, జమైత్ ఉలేమాఈహిందలు ,ప్రభుత్వం దృష్టికి తీసుకపోయినా కూడా, గోగుండాలపై ఎటువంటి చట్టపరమైన, చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. దేశవ్యాప్తంగా పలుప్రాంతాలలో చోటుచేసుకుంటున్న ఈ వేధింపులు, మూకదాడుల, ఘటనలపై నిరసన గళాలు వినబడుతున్నాయి అని వారు తెలిపారు. గోవధకు పాల్పడ్డారంటూ, నిరాధారమైన ఆరోపణలతో, వేధింపులకు గురిచేసి, చంపడం ,ఇళ్లను కూల్చివేయడం వంటి కిరాతకలకు, పాల్పడుతుండడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలని,కేంద్ర ప్రభుత్వం లోని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలను కోరారు. దేశంలో నెలకొన్న విద్వేష పరిస్థితులపై, ఆవాజ్ కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తుందని వారు వివరించారు. ప్రజలందరి భద్రత, రక్షణ తమ ప్రభుత్వ బాధ్యత అని చెబుతూ,అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం, ఆ కీలక బాధ్యతను, విస్మరించినట్లు, కనిపిస్తోందని ఆవాజ్ కమిటీ వ్యాఖ్యానించింది. తక్షణమే కేంద్ర ప్రభుత్వం గోమూక దాడులను చట్టపరంగా శిక్షించడానికి కఠినమైన చర్యలు తీసుకోవడానికి అవసరం అయిన, చర్యలు తీసుకోవాలన్నారు.

మారుతి ట్రేడర్స్ లైసెన్సుతాత్కాలిక నిలిపివేత

వ్యవసాయ శాఖ రాష్ట్ర తనిఖీ అధికారి శ్రీనివాస రావు

ప్రజాశక్తి మంత్రాలయం : స్టాకు వివరాలు తెలుపే రికార్డులు సక్రమంగా లేకపోవడంతో మారుతి ట్రేడర్స్‌లోని ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని అంతవరకు దుకాణం లైసెన్సును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ శాఖ రాష్ట్ర తనిఖీ అధికారి గన్నవరం ఎడిఎ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ మారుతి ట్రేడర్స్ దుకాణంలో అన్ని రకాల ఎరువుల విలువ మొత్తం రూ.1462728 గల 83.170 మెట్రిక్ టన్నుల నిల్వ ఉండగా అందుకు తగిన రికార్డుల నిర్వహణ లేదని అందువల్ల దుకాణం నిర్వాహకులు భీమిరెడ్డిని హెచ్చరించి తాత్కాలికంగా దుకాణం లైసెన్సు నిలిపి చేశామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎడిఎ మహమ్మద్ ఖాద్రి, ఎడి దస్తగిరి రెడ్డి మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్

ఎమ్మిగనూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగుల మందులు. విత్తనాలు డీలర్లు తయారీ కంపెనీలు, విత్తన సంస్థల పై అన్ని జిల్లాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు టీమ్‌లుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు గన్నవరం ఎడిఎ శ్రీనివాసరావు, కర్నూలు సిఎ. కేశవ రెడ్డి, జెడిఎ కార్యాలయం అగ్రికల్చర్ అధికారి దస్తగిరి, స్థానిక వ్యవసాయ అధికారులు ఏడిఏ మహమ్మద్ ఖాద్రి, ఏఈ. మహేశ్వర రెడ్డి. సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో రెండు టిమ్ లుగా ఎమ్మిగనూరు, ఆదోని అలూరు. పత్తికొండ పర్యటన భాగంగా ఉదయం మంత్రాలయం మండలం మాధవరంలో మారుతి ట్రేడర్స్ ఎరువులు లైసెన్సు సంబంధించిన రూ.12 లక్షల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. లైసెన్సు సస్పెండ్ చేశామన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఎరువుల దుకాణాల తనిఖీ భాగంగా మేకల బజార్ త్రివేణి ఆగ్రో ఎంటర్ ప్రైజెష్ సోర్స్ సర్టిఫికెట్ లేనందున రూ.8 లక్షల 75 వేల విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలిపేశామన్నారు. మారుతి ఫర్టిలైజేర్ దుకాణాం నందు తనిఖీలు నిర్వహించామన్నారు. వివిధ దుకాణాల్లో తనిఖీలు చేపట్టునున్నామన్నారు.




మంత్రాలయంలో తనిఖీ చేస్తున్న రాష్ట్ర అధికారి శ్రీనివాస రావు

దేవనకొండ : దేవనకొండలో ఎరువుల దుకాణాలను కర్నూలు విజిలెన్స్ డిఇ చంద్రశేఖర్ , ఎడిఎ హనుమంతరావు, మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. సత్యసాయి ఏజెన్సీస్ ,సాయి గణేష్ ట్రేడర్స్ కిసాన్ మాల్ కేంద్రంలోని స్టాకు, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించారు. సాయి గణేష్ ట్రేడర్స్‌లో బీసీలు ఇంక్లూడ్ చేసుకోలేదని, కిసాన్ మాల్‌లో మిషన్ బ్యాలెన్స్ గ్రౌండ్ బ్యాలెన్స్ వ్యత్యాసం ఉన్నందున వారికి కొనుగోలు నిలిపి వేశామని తెలిపారు. ఎఇఒ జయరాం పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవాన్ని పెంచింది ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి -విలేకరులు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో మాదిగల ఆత్మగౌరవాన్ని పెంచింది మందకృష్ణ మాదిగ నేతృత్వంలోని ఎంఆర్‌పిఎస్ అని ఎంఆర్‌పిఎస్ నాయకులు అన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి, మద్దికేర, కౌతాళం, మంత్రాలయం, తదితర మండలాల్లో జెండాలను ఎగురవేశారు. ఆదోనిలోని ఆయా ప్రాంతాల్లో మాదిగల ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసి ఎమ్మార్పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ, బండారి గిడ్డయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటంతోపాటు ఆరోగ్యశ్రీ కార్డు, వద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ పెంపు కోసం ఉద్యమాలు చేశామన్నారు.

ఎమ్మిగనూరు: ఎంఆర్‌పిఎస్ ఏర్పడి 30 ఏళ్లు నిండిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ నేతలతో కలిసి ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు, ఉపాధ్యాయులు అంపయ్య మాదిగ జెండాను ఆవిష్కరించారు.



కోసిగి: ఎంఆర్‌పిఎస్ 30 ఆవిర్భావ దినోత్సవం కోసిగి మండలంలోని వందగల్లు గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

మద్దికేర : ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మద్దికెరలో ఘనంగా నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు నగర శివారులోని విజ్ఞాన పీఠం స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే దస్తగిరిని ఆత్మీయంగా ఆహ్వానించి సన్మానించారు. నాటి తీపి జ్ఞాపకాలను స్మృతులను ఒక్కొక్కటిగా నెమరు వేసుకున్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, నేను నాలుగో తరగతి నుండి పదవ తరగతి వరకు ఈ స్కూల్లోనే విద్యాభ్యాసం చేశానన్నారు. నాకు విజ్ఞాన పీఠం స్కూల్లో ఉపాధ్యాయులు నేర్పించిన విలువలు, సంస్కారం వల్ల నేను ఈ స్థాయికి వచ్చానని, ఈ పాఠశాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈ స్థాయిలో ఉన్నానంటే మా గురువు దైవ సమానులు అయినటువంటి డి.విష్ణువర్ధన్ రెడ్డి దయవలన అన్నారు. మా ఉపాధ్యాయుల సమక్షంలో, మా తోటి సహచరులు, సీనియర్లు, జూనియర్ల, సమక్షంలో ఈ కార్యక్రమం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందించడానికి కృషి చేస్తానని అన్నారు.కరస్పాండెంట్ పిపి.గురుమూర్తి, హెడ్మాస్టర్ వ్యాస్‌రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు రామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.